ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

చిత్తూరు
జిల్లా వార్తలు

సోమవారం 3 జూన్ 2024

- రేపే ఓట్ల లెక్కింపు
- ఎగ్జిట్ పోల్స్‌తో కూటమి అభ్యర్థుల్లో ధీమా
- వైసీపీలో కనిపించని ఉత్సాహం
- కౌంటింగుకు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- అంతటా పటిష్ట బందోబస్తు
- ఫలితాల అనంతర పరిణామాలపైనా పోలీసుల దృష్టి

మిగిలింది ఒక్క రోజే





చిత్తూరులోని గాంధీ విగ్రహం వద్ద సాయుధ పోలీసులు

పోలింగ్ జరిగింది మే 13న. అప్పట్నుంచి ఫలితాల కోసం అభ్యర్థులు, ఆయా రాజకీయ పార్టీలు, ప్రజలు ఎదురు చూస్తున్నారు. 21 రోజుల ఉత్కంఠకు ఇంకొక రోజులో తెరపడనుంది. చిత్తూరులోని ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంగా మంగళవారం కౌంటింగ్ జరగనుంది. ఇప్పటికే అనేక సర్వే సంస్థలు ఇచ్చిన ఎగ్జిట్ పోల్స్‌తో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు, నేతలు, శ్రేణులు గెలుపుపై ధీమాగా ఉన్నారు. వైసీపీ నేతలూ గెలుపుపై ధీమా వ్యక్తంచేస్తున్నప్పటికీ లోలోన ఆందోళనలో ఉన్నారు. ఎగ్జిట్ పోల్స్ కూడా వీరిలో ఉత్సాహం నింపలేదు. మరోవైపు ఎలాంటి గొడవలు లేకుండా కౌంటింగ్ నిర్వహించేందుకు అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం ఓట్ల లెక్కింపునకు టేబుళ్ల వారీ ఏర్పాట్లు పూర్తి చేశారు. కౌంటింగ్ సమయంలోనూ... ఫలితాల అనంతరం గొడవలు జరగొచ్చనే అనుమానంతో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్యూఆర్టీ వాహనాలతో పటిష్ఠ నిఘా

చిత్తూరు, జూన్ 2: కౌంటింగ్ రోజున క్విక్ రియాక్షన్ టీమ్ (క్యూఆర్టీ) వాహనాలతో పోలీసులు పటిష్ఠ నిఘా చేపట్టారు. ఈ మేరకు ఎస్పీ మణికంఠ చందోలు ఒక ప్రకటన విడుదల చేశారు. 'కౌంటింగ్ ప్రారంభమై ముగిసే వరకు నిర్దిష్ట దూరం వరకు వీడియో కెమెరాలతో క్యూఆర్టీ వాహనాలతో నిఘా ఉంచుతారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా చట్ట విరుద్ధ కార్యకలాపాలు జరిగితే వెంటనే స్పందించేందుకు ఈ వాహనాలు సాక్ష్యాధారాలుగా నిలుస్తాయి. జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ముగ్గురుకంటే ఎక్కువ మంది గుడికూడితే ఈ చట్టాన్ని ప్రయోగిస్తారు. కౌంటింగ్ రోజున అవసరమైతే తప్ప ప్రయాణాలు చేయరాదు. ఇంట్లోనే ఉండాలి. చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారి గురించి 101, 112 లేదా పోలీసు వాట్సప్ నెంబరు 94409 00005కు సమాచారం ఇవ్వాలి' అని ఆ ప్రకటనలో ఎస్పీ కోరారు.

క్యూఆర్టీ వాహనం



అమ్మో.. పోస్టల్ బ్యాలెట్

వైసీపీలో వణుకు పుట్టిస్తున్న ఉద్యోగుల ఓట్లు

వైసీపీ అభ్యర్థులను ఎగ్జిట్ పోల్స్‌తో పాటు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉన్న ఉద్యోగులు కూటమికే పూర్తి స్థాయిలో ఓట్లేశారనే సమాచారంతో వీరు ఆందోళన చెందుతున్నారు. చాలా నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు గెలుపోటములను శాసించేలా ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రం చిత్తూరులో అత్యధికంగా, కుప్పంలో అత్యల్పంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. ఏడు నియోజకవర్గాల్లో కలిపి 20,520 పోస్టల్ బ్యాలెట్లు పోలవడంతో అధికార పార్టీ అభ్యర్థుల్లో గుబులు మొదలైంది. పూతలపట్టు, నగరి నియోజకవర్గాల్లో వైసీపీ గతంలో అతి తక్కువ మెజార్టీతో గెలుపొందింది. ఈసారి కూడా అభ్యర్థుల గెలుపోటములు స్వల్ప ఓట్ల తేడాతో ఉంటాయని విశ్లేషకుల అంచనా. ఈ క్రమంలో అన్ని నియోజకవర్గాల్లోనూ పోస్టల్ బ్యాలెట్లు కీలక పాత్ర పోషించనున్నాయి. ప్రధానంగా చూస్తే.. పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల్లో ఇరుపార్టీల మధ్య పోటీ టఫ్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. చిత్తూరులో 4219, పూతలపట్టులో 3844 చొప్పున పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. పోటీ టఫ్‌గా ఉండటంతో స్వల్ప తేడాతో గెలుపు ఓటములు ఉంటాయని..ఇక్కడ పోస్టల్ బ్యాలెట్ కీలకం కానుందని పరిశీలకులు భావిస్తున్నారు.ఇది తమకు లాభిస్తుందని టీడీపీ అభ్యర్థులు ధీమాగా ఉన్నారు. ఇక, ఎప్పుడూ స్వల్ప ఓట్ల తేడాతో వైసీపీ గెలిచే నగరిలో ఈసారి టీడీపీకి మంచి మెజార్టీ వస్తుందని అన్ని ప్రధాన సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్‌లో అంచనా వేశాయి. ఇక్కడ ఉన్న 2561 పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు మించి టీడీపీకి మెజార్టీ వస్తుందని వారి మాట.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలైన పోస్టల్ బ్యాలెట్ల వివరాలు

నియోజకవర్గం	పోస్టల్ బ్యాలెట్లు
చిత్తూరు	4219
పూతలపట్టు	3844
పుంగనూరు	3168
జీడీనెల్లూరు	2691
నగరి	2561
పలమనేరు	2482
కుప్పం	1555
మొత్తం	20,520

– చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు

- అన్ని చర్యలూ చేపట్టాం
- ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు నిషేధం
- కలెక్టర్ షన్మోహన్ వెల్లడి
- కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్న ఎస్పీ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 2: ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. ఎస్పీ మణికంఠ, జేసీ శ్రీనివాసులుతో కలిసి కౌంటింగ్‌కు సంబంధించిన వివరాలను ఆదివారం ఆయన మీడియాకు వెల్లడించారు. ఓట్ల లెక్కింపుకోసం ఏడు నియోజకవర్గాలకు ఏడు హాళ్లు, పార్లమెంటు నియోజకవర్గానికి ఏడు హాళ్లు, పోస్టల్ బ్యాలెట్లకు ఒకటి కలిపి 15 హాళ్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి నియోజకవర్గానికీ 14 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్ల కోసం మూడు టేబుళ్లు, పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం 18 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇక, 263 మంది సూపర్‌వైజర్లు, 339 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 310 మంది మైక్రో అబ్జర్వర్లు వెరసి 912 మందికి విధులు కేటాయించామన్నారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం కౌంటింగ్‌కు ప్రతి టేబుల్‌కు ఒక మైక్రో అబ్జర్వర్‌ను నియమించామన్నారు. ప్రతి ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ టేబుళ్ల వద్ద ఒక్కొక్క కౌంటింగ్ ఏజెంట్‌ను నియమించుకోవచ్చని సూచించారు. అభ్యర్థులు లేదా ఎన్నికల ఏజెంట్లను ఆర్వో టేబుల్ వద్దకు వెళ్లేందుకు అనుమతించమన్నారు. కౌంటింగ్ రోజున ఉదయం 5 గంటలకు సిబ్బందిని కేటాయిస్తామన్నారు.

ఐదుగురు అబ్జర్వర్ల నియామకం

జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పరిశీలనకు ఐదుగురు అబ్జర్వర్లను కేంద్ర ఎన్నికల సంఘం నియమించిందని కలెక్టర్ చెప్పారు. చిత్తూరు నియోజకవర్గానికి మొహమ్మద్ షాదిక్ అలాం, పుంగనూరుకు ఎస్.కవిత మన్నికేరి, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు బి.కె. మమత, నగరికి భరత్ భూషణ్, గంగాధరనెల్లూరు, పూతలపట్టుకు అఖౌరీ శశాంక్ సిన్హాను నియమించిందన్నారు.

అత్యధిక పోలింగ్‌లో ద్వితీయ స్థానం

ఈసారి 87.09 శాతంతో రాష్ట్రంలోనే జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో మాత్రమే అతి తక్కువగా 81.24శాతం పోలింగ్ జరిగిందన్నారు. చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి 85.77 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు.

అటు ఇచ్చి.. ఇటు తీసుకుంటాం

రాజంపేట పార్లమెంటు పరిధిలోని పుంగనూరు నియోజకవర్గంలో ఎంపీ స్థానానికి పోలైన ఓట్ల వివరాలను రాయచోటి జిల్లాకు చేరుస్తామని కలెక్టరు తెలిపారు. అలాగే చిత్తూరు పార్లమెంటు పరిధిలోని చంద్రగిరి నియోజకవర్గంలో పోలైన ఓట్ల వివరాలను తిరుపతి జిల్లా నుంచి తీసుకుంటామని వివరించారు.

తప్పుడు సమాచారం వస్తే చెప్పండి

ఓట్ల లెక్కింపు సందర్భంగా మంగళవారం కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్‌తో వెళ్ళేందుకు మీడియాకు మాత్రమే అనుమతిస్తున్నట్లు కలెక్టరు షన్మోహన్ చెప్పారు. ఆరోజు సామాజిక మాధ్యమాల్లో ఏదైనా తప్పుడు సమాచారం లేదా వార్తలు వస్తే తనకు లేదా ఎస్పీకి తెలియజేయాలని కోరారు. ఓట్ల లెక్కింపు రౌండ్ల వారీ వివరాలను మీడియా సెంటర్‌కు అందజేస్తామన్నారు. కౌంటింగ్ పాస్ లేకుండా ఎవరినీ కేంద్రాల్లోకి అనుమతించమని స్పష్టంచేశారు. ఏజెంట్లు వారికిచ్చే పాస్ తప్ప పెన్, పెన్సిల్ తీసుకుని రాకూడదని, వాటిని తామే ఇస్తామన్నారు.

మూడంచెల భద్రత: ఎస్పీ

కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత చేసినట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి అల్లర్లు, సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ తర్వాత కూడా జిల్లాలో మొబైల్ పికెట్లు, మొబైల్ పార్టీలను, నైట్ పెట్రోలింగ్‌ను ఏర్పాటు చేశామన్నారు. గొడవలు చేసేవారిని, రౌడీషీటర్లను గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు బైండోవర్ చేశామన్నారు. దాదాపు 20వేల మంది రౌడీషీటర్లను గుర్తించామన్నారు. 300 మందిని ముందస్తుగా అరెస్టు చేశామన్నారు. పార్టీలకు సంబంధించి ఎక్కడైనా ఘర్షణకు దిగితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, విజయవంతంగా చేయడానికి పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో పుల్లయ్య పాల్గొన్నారు.

ఇప్పటికి వచ్చింది 1005 సర్వీసు ఓట్లు

జిల్లాకు సంబంధించి 3,991 సర్వీసు ఓటర్లకుగాను 1005 మంది నుంచి పోస్టల్ బ్యాలెట్ కవర్లు అందాయని కలెక్టరు షన్మోహన్ చెప్పారు. వాటిని సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో భద్రపరిచి, మంగళవారం ఉదయం తానే గట్టి బందోబస్తు మధ్య కౌంటింగ్ కేంద్రానికి తీసుకెళ్తానన్నారు. ఇక, ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్‌లను 4వ తేది ఉదయం 6 గంటలకు రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ పరిశీలకులు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరుస్తామని చెప్పారు.

కౌంటింగ్ కేంద్రానికి మద్యం తాగొస్తే తరిమేస్తారు?

చిత్తూరు, జూన్ 2: కౌంటింగ్‌కు వెళ్లే అధికారులు, ఏజెంట్లు ఎవరైనా మద్యం తాగి వస్తే పోలీసులు పట్టుకుని వెనక్కి పంపేస్తారు. అనుమానం వచ్చిన వారికి బ్రీత్ అనలైజర్‌తో చెక్‌చేసి పంపుతామని పోలీసులు చెబుతున్నప్పటికీ అందరినీ పరీక్షిస్తారని సమాచారం. ముందురోజు మద్యం తాగి.. మరుసటి రోజు కేంద్రానికి వస్తే తెలియదని చాలామంది అనుకుంటున్నారని, అయితే ముందు రోజు మద్యం తాగినా తనిఖీలో పట్టుబడుతారని ట్రాఫిక్ పోలీసు అధికారి ఒకరు చెప్పారు. పోలీసుల సూచనలను పాటించి అన్నిపార్టీల ఏజెంట్లు జాగ్రత్తలు తీసుకోవాలని, లేకుంటే అవమానంతో పాటు కౌంటింగ్ ప్రక్రియ నుంచి బయటకు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.





ఆర్టీసీ బస్టాండు వద్ద.. కట్టమంచిలో ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద ఎగబడ్డ మందుబాబులు

మందుకోసం..

- నేటి నుంచి మూడు రోజుల పాటు దుకాణాల బంద్

చిత్తూరు సిటీ, జూన్ 2: ఓట్ల లెక్కింపు ప్రభావం మందుబాబులపై పడింది. సోమవారం నుంచి బుధవారం వరకు.. మూడు రోజులపాటు మద్యం దుకాణాలు, బార్లు మూతపడనున్నాయి. దీంతో మందుబాబులు ఆదివారం దుకాణాల వద్ద క్యూ కట్టారు. చాలా మంది మూడు రోజులకు సరిపడా మద్యం కొనుగోలు చేసేందుకు ఆరాటపడ్డారు. ఆదివారం మధ్యాహ్నానికే మద్యం సీసాలు ఖాళీ కావడంతో దుకాణాలు మూతపడ్డాయి. బార్లు రాత్రి వరకు కిటకిటలాడాయి. తిరిగి 6వ తేది ఉదయం మద్యం దుకాణాలు, బార్లు తెరుచుకోనున్నాయి.

వైసీపీ భక్త గుడిపాల ఎస్ఐపై వేటు

- పోలింగ్ రోజు అలసత్వం వహించారని సస్పెన్షన్
- గతంలోనూ రెండుసార్లు వీఆర్‌కు..
- చిత్తూరు వైసీపీ అభ్యర్థికి విధేయుడిగా ముద్ర



చిత్తూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా పనిచేసి ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టిన గుడిపాల ఎస్ఐ శ్రీనివాసరావు సస్పెండయ్యారు. పోలింగ్ రోజున అలసత్వం వహించారని ఉన్నతాధికారులు ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఈయన ముద్ర వేసుకున్నారు. జిల్లాలో ఆయన పనిచేసిన అన్ని పోస్టింగుల వెనుక విజయానందరెడ్డి ఉన్నట్లు పోలీసు వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తొలుత విజయానందరెడ్డి సొంత మండలమైన ఎస్ఆర్‌పురంలో పనిచేశారు. అక్కడ ఓ యాక్సిడెంట్ కేసులో ప్రమాదానికి కారణమైన వాహనాన్ని మార్చడం, అలస్యంగా కేసు పెట్టడం.. వంటి విషయాలను ఉన్నతాధికారులు గుర్తించి వీఆర్‌కు పంపినట్లు సమాచారం. ఆ సమయంలో ఆయన విజయానందరెడ్డికి దగ్గరగా ఉండేవారన్న ఆరోపణలున్నాయి. వీఆర్‌లో కొంతకాలం ఉన్న తర్వాత విజయానందరెడ్డి ఒత్తిడితో జీడీనెల్లూరులో పోస్టింగ్ ఇచ్చినట్లు చెబుతారు. అక్కడా ఓ వైసీపీ నేత పట్ల దురుసుగా ప్రవర్తించడంతో.. స్టేషన్ ఎదుట ప్రధాన రహదారికి అడ్డుగా గ్రామస్థులు ధర్నా చేశారు. ఎస్ఐ శ్రీనివాసరావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అప్పటి డీఎస్పీ శ్రీనివాసమూర్తి సర్దుబాటు చేయాల్సి వచ్చింది. బాధిత వైసీపీ నాయకులు ఎస్ఐను మార్చాల్సిందేనని డిప్యూటీ సీఎం నారాయణస్వామి వద్ద పట్టుబట్టారు. దీంతో అతడిని మళ్లీ వీఆర్‌లో ఉంచారు. ఆ తర్వాతా విజయానందరెడ్డి కల్పించుకుని కాణిపాకంలో పోస్టింగ్ ఇప్పించినట్లు డిపార్ట్‌మెంటులో గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఎన్నికల ముందు గుడిపాలకు..

సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న క్రమంలో గుడిపాలలో తన కోసం పనిచేసే శ్రీనివాసరావును కాణిపాకం నుంచి విజయానందరెడ్డి తెచ్చుకున్నట్లు సమాచారం. అప్పటి వరకు గుడిపాలలో పనిచేసిన ఎస్ఐ రామ్మోహన్ నిక్కచ్చిగా పనిచేసినట్లు చెబుతారు. ఇలా పనిచేసే వారితో ఎన్నికల్లో ఇబ్బంది అవుతుందని పోలీసు ఉన్నతాధికారుల మీద ఒత్తిడి తెచ్చి మార్చేసినట్లు అప్పట్లో ప్రచారం వచ్చింది. రామ్మోహన్‌కు పోలీసు అధికారులు కాణిపాకంలో పోస్టింగ్ ఇచ్చారు. గుడిపాల ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్న శ్రీనివాసరావు.. తొలి రోజు నుంచీ స్వామి భక్తి చాటుకున్నారని స్థానికంగా చర్చ ఉంది. గుడిపాల పంచాయతీలో పేదల కోసం వాటర్‌ట్యాంకును టీడీపీ నాయకులు ఏర్పాటు చేశారు. వైసీపీ నేతల ఫిర్యాదుతో టీడీపీ శ్రేణుల్ని బైండోవర్ చేశారు. పోలింగ్ రోజున ఎలాంటి కారణాలు లేకున్నా వైసీపీ నేత ఫిర్యాదుతో టీడీపీ నాయకులపై చేయి చేసుకున్నారు. మండికృష్ణాపురం పోలింగ్ కేంద్రం వద్ద ఇరుపార్టీల ఘర్షణ కత్తిపోట్లకు దారితీసినా, ఎస్ఐ సకాలంలో స్పందించకుండా టీడీపీ నాయకుల మీద కేసులు పెట్టారు. చీలాపల్లె పోలింగ్ కేంద్రంలో పోలింగ్ రోజున ఇరుపార్టీల మధ్య జరిగిన ఘర్షణలో టీడీపీ వారి మీదే కేసులు పెట్టారు. ఇలా గుడిపాలలో ఇతడిపై అనేకరకాల ఆరోపణలు రావడం.. ఏకపక్షంగా పనిచేశారని ఉన్నతాధికారులు గుర్తించడంతో సస్పెన్షన్ వేటు పడింది.

కుటుంబ సమస్యలా.. మరేదైనా కారణమా?

- రాయచోటి జిల్లా పోలీసు కార్యాలయంలో గన్‌తో కాల్చుకున్న మహిళా కానిస్టేబుల్
- మృతురాలిది భీమగానిపల్లె గ్రామం



వేదవతి (ఫైల్ ఫొటో)

పుంగనూరు/రాయచోటి టౌన్, జూన్ 2: కుటుంబ సమస్యా.. లేదా ఏదేని ఒత్తిడా.. లేకుంటే ఎవరితోనో ఫోన్లో మాట్లాడటం వల్ల నిర్ణయం తీసుకున్నారా.. కారణం ఏమోగానీ అన్నమయ్య జిల్లా రాయచోటి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సెంట్రీ డ్యూటీలో ఉన్న కబ్బాలి వేదవతి(28) ఆదివారం సాయంత్రం గన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈమెది పుంగనూరు మండలం భీమగానిపల్లె గ్రామం. ఈమె గంగాధర్, రాఘవమ్మ దంపతుల కుమార్తె. 2016లో పోలీసు ఉద్యోగం కోసం పుంగనూరు పోలీస్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్నారు. ఆ సమయంలో ఫ్యాకల్టీగా పనిచేసే మదనపల్లెకు చెందిన దస్తగిరితో ఏర్పడిన పరిచయం... ప్రేమగా మారి.. పెళ్లి చేసుకున్నారు. వీరికి ప్రస్తుతం ఐదేళ్ల కుమార్తె ఉంది. ఏఆర్ మహిళా పోలీసుగా 2017లో వేదవతికి ఉద్యోగం వచ్చింది. చిత్తూరులో పనిచేస్తూ ఏడాది కిందట బదిలీపై అన్నమయ్య జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చారు. భార్యాభర్తలు రాయచోటి పట్టణంలోని రాజీవ్ స్వగృహ పక్కన గల ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నారు. కాగా, దస్తగిరికి గతంలోనే వివాహమై ఇద్దరు కుమారులు ఉన్నారు. మొదటి భార్య వదిలి వెళ్లిపోవడంతో ఆ ఇద్దరు కుమారులు ప్రస్తుతం మదనపల్లెలోని నానమ్మ వద్ద ఉంటూ చదువుకుంటున్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో సెంట్రీ డ్యూటీలో ఉన్న వేదవతి గన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఐదు గంటలకు సెంట్రీ డ్యూటీకి వచ్చిన మరో కానిస్టేబుల్.. రక్తపుమడుగులో కుర్చీలో పడున్న వేదవతిని గమనించి అధికారులకు సమాచారమిచ్చారు. డీఎస్పీ రామచంద్రరావు, అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ భక్తవత్సలం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, సెంట్రీ డ్యూటీలో ఉన్న సమయంలో ఎవరితోనో ఫోన్లో మాట్లాడిన అనంతరం ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. తన భార్యతో నాలుగు గంటలకు ఫోన్లో మాట్లాడగా బిర్యానీ తీసుకు రమ్మని చెప్పిందని దస్తగిరి చెబుతున్నారు. తాను చికెన్ తీసుకునేందుకు వెళ్లగా.. మీ భార్య గన్‌తో కాల్చుకుని చనిపోయినట్లు తనకు ఫోను చేసి చెప్పారన్నారు. వేదవతి మీకు రెండో భార్య అంట కదా, ముందు భార్యకు ఇద్దరు పిల్లలు ఉన్నారట కదా అని దస్తగిరిని అడగ్గా.. అలాంటిదేమీ లేదంటూ మొదటి పెళ్లి విషయంపై దాటవేసేలా మాట్లాడారు. కుటుంబ సమస్యల కారణంగానే వేదవతి ఆత్మహత్య చేసుకుందా.. లేక ఫోన్లో ఎవరితోనో మాట్లాడి ఆత్మహత్యకు పాల్పడిందా అనే విషయం విచారణలో తేలాల్సి ఉంది.

బైరెడ్డిపల్లిలో అత్యధిక వర్షపాతం



గుడిపాల మండలం ఏఎల్ పురంలో విరిగిపడ్డ విద్యుత్ స్తంభం, బైరెడ్డిపల్లె మండలంలో విరిగిన విద్యుత్ స్తంభంపై భాగం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 2: జిల్లాలో నాలుగు మినహా మిగిలిన 28 మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుండడంతో శనివారం ఉదయం 8 నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు పలుచోట్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బైరెడ్డిపల్లిలో 63.6మి.మీ, అత్యల్పంగా పాలసముద్రంలో 1.2 మి.మీ నమోదైంది. గుడుపల్లి 56.4, కుప్పం 54.0, గుడిపాల 36.0, పెనుమూరు 27.0, యాదమరి 23.0, చిత్తూరు అర్బన్ 19.4, ఐరాల 18.2, రామకుప్పం 18.2, బంగారుపాళ్యం 17.2, వి.కోట 16.2, తవణంపల్లె 15.6, శాంతిపురం 15.4, విజయపురం 15.2, పులిచెర్ల 14.2, సోమల 10.4, సదుం 10.2, చిత్తూరు రూరల్ 10.2, శ్రీరంగరాజపురం 8.2, పూతలపట్టు 8.0, వెదురుకుప్పం 6.4, పుంగనూరు 4.2, గంగాధరనెల్లూరు 4.2, పలమనేరు 3.4, చౌడేపల్లి 2.6, గంగవరం 2.4, పెద్దపంజాణిలో 2.0 మి.మీ నమోదైంది.

నేల కూలిన విద్యుత్తు స్తంభాలు

శనివారం రాత్రి కురిసిన గాలీవానకు పెనుమూరు మండలంలోని పలు చోట్ల విద్యుత్తు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. గుడిపాల మండలంలో 10 విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. కొత్తపల్లి దళితవాడలో పిడుగుపాటుకు మేక మృతిచెందింది. అరటి, మామిడికాయలు నేలపాలయ్యాయి. కుప్పంలో ఒక టైల్స్ షెడ్డు కూలిపోయింది. బైరెడ్డిపల్లె మండలం టీఎన్‌కుప్పం వద్ద నేల కూలిన టేకు వృక్షం విద్యుత్ తీగలపై పడటంతో 33 కెవీ విద్యుత్ స్తంభం పైభాగం విరిగి పోయింది.

రైల్వే ట్రాక్‌పై విరిగిపడిన చెట్టుకొమ్మలు



పాకాల: తిరుపతి జిల్లా పాకాల-తిరుపతి రైల్వే మార్గంలో గాదంకి సమీపాన ఆదివారం సాయంత్రం రైల్వే ట్రాక్‌పై గాలివానకు చెట్టుకొమ్మలు విరిగి పడ్డాయి. ఆ సమయంలో తిరుపతి నుంచి బెంగళూరు వెళ్తున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ పరిస్థితి గమనించి.. రైలు నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. రైల్వే సిబ్బంది చెట్టుకొమ్మలు తొలగించడంతో అరగంట ఆలస్యంగా వెళ్లింది.

పుత్తూరులో పిడుగుపాటుకు 5 ఆవుల మృతి



పుత్తూరు: మండలంలోని పరమేశ్వరం మంగళం పంచాయతీలోని జయరాణీపురం గ్రామ పొలిమేరలో ఓ చెట్టు కింద ఆవులు గడ్డిమేస్తుండగా పెద్ద శబ్దంతో ఆదివారం ఉదయం పిడుగు పడింది. దీంతో ఐదు ఆవులు షాక్‌కు గురై కుప్పకూలిపోయి మృతి చెందాయి.తనకు నష్టపరిహారం ఇప్పించాలని వాటి యజమాని శ్యామల.. ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

ఒక్కరోజు ఓపిక పట్టు!

కుప్పంలో పెరుగుతున్న 'కౌంటింగ్' వేడి

కుప్పం, జూన్ 2: రాష్ట్రంలోనే కీలక నియోజకవర్గమైన కుప్పంలో కౌంటింగ్ వేడి అమాంతం పెరిగిపోయింది. మధ్యలో ఒక్క రోజు మాత్రమే మిగిలి ఉన్న సమయంలో వర్గాలుగా విడిపోయిన వ్యక్తులు విధ్వంస లక్ష్యాలను కూడా విధించుకుంటున్నారన్న ప్రచారం వారం పది రోజులుగా చక్కర్లు కొడుతోంది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పోటీ చేస్తున్న కుప్పంపైనే తొలినుంచీ అందరి దృష్టీ కేంద్రీకృతమైంది. ఇక్కడ ఆయనను ఓడించే అంత సీను ఉన్నదో లేదో కానీ, మెజారిటీ గణనీయంగా తగ్గించడానికి మాత్రం సాక్షాత్తు మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలకు ముందు సామదాన భేద దండోపాలన్నీ ప్రయోగించేశారు. వైసీపీ నుంచి చంద్రబాబుకు పోటీగా భరత్ బరిలో ఉన్నారు. ఎగ్జిట్ పోల్స్ వెలువడిన నేపథ్యంలో ఫలితాల గురించి చర్చోపచర్చలు అధికమైపోయాయి. చంద్రబాబుకు 60-70 వేల మెజారిటీ వస్తుందని, లేదు.. 25 వేల మెజారిటీతో భరత్ గెలిచిపోతున్నాడని బెట్టింగ్‌లు ప్రస్తుతం రన్నింగ్‌లో ఉన్నాయి. ఇప్పుడిలా బెట్టింగ్‌లు పెట్టిన వారితోపాటు, ఆయా రాజకీయ పార్టీల వ్యక్తులు కూడా రెచ్చిపోవడం ప్రారంభిస్తున్నారు. దాదాపు బహిరంగంగానే చర్చలకు తెర తీస్తున్నారు. ఫలితాల విడుదలకు ఒక్క రోజు మాత్రమే మిగిలిన క్రమంలో కుప్పంలో ఉద్రిక్తత తారస్థాయికి చేరుకుంటోంది.

> 'అదే చెబుతున్నాం, ఒకరోజు ఓపిక పట్టు అని.' 'వెయిట్ చేస్తే తెలుస్తుంది, ఏముంటుంది రా అని.'
>
> .. ఒక వాట్సాప్ గ్రూపులో జరిగిన వాదోపవాదాలలో ఇది శాంపుల్ మాత్రమే. ఈ గ్రూపులో ఇంతకన్నా తీవ్రమైన వ్యాఖ్యలున్నాయి.

> 'ఆ పార్టీ గెలిస్తే వారిపైన దాడి చేస్తారంట కదా, నిజమేనా?' 'నిజమేనంట. ఈ పార్టీ వోల్లు కూడా తాము గెలిస్తే ఆ రెండింటినీ వదిలే ప్రసక్తే లేదని ఒట్టు పెట్టుకుంటా వుండారంట.'
>
> .. కుప్పంలో ఏ ఇద్దరు వ్యక్తులు కలిసినా జరుగుతున్న సంభాషణ ఇది.

హాస్పిటల్స్ టార్గెట్?

ఏ రాజకీయ పార్టీ అయిన గెలుపోటములు సహజం. కానీ కుప్పంలో దీన్ని అంగీకరించే పరిస్థితుల్లో ఆయా పార్టీ వర్గాలు ఉన్నట్లు కనిపించడంలేదు. కొద్దిరోజులుగా గ్రామాలలో పెరుగుతున్న ఉద్రిక్తతలే దీనికి నిదర్శనం. కుప్పం మండలం ఎన్.కొత్తపల్లెలో కేవలం తాగునీటి సరఫరా బకాయి అడిగినందుకు వైసీపీ కార్యకర్త ఒకరు, టీడీపీ కార్యకర్తలైన జయశంకర్, రెడ్డిపై దాడి చేసి తీవ్రంగా కొట్టిన సంఘటన తాజాగా చోటు చేసుకుంది. కేవలం నెల్లాళ్ల వ్యవధిలో నియోజకవర్గ వ్యాప్తంగా ఇటువంటి సంఘటనలు ఆరేడు జరిగాయి. పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు. ఈసారి కుప్పం పట్టణంలోని మూడు హాస్పిటల్స్‌ను కొందరు టార్గెట్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధి... టీడీపీకి నాయకుడిది మరొకటి.. మూడవది టీడీపీ నాయకుడి సంతానం నిర్వహణలో ఉన్న హాస్పిటల్. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఏ హాస్పిటల్స్ టార్గెట్ అవుతాయో సులువుగా అర్థమవుతుంది. ఈ చర్చ వారం రోజులనుంచి పట్టణంలో విస్తృతంగా జరుగుతోంది. ఈ ప్రచారానికి భయపడిపోయిన ఆయా యాజమాన్యాలు తమ హాస్పిటల్స్ వద్ద సీసీ కెమెరాల సంఖ్య పెంచుకుంటున్నారు. ప్రైవేటు సైన్యాన్ని కూడా నియమించుకుంటున్నట్లు తెలిసింది. కేవలం హాస్పిటల్స్ మాత్రమే కాకుండా ఇతర ఆస్తుల మీద కూడా ఇప్పటికే కొందరి దృష్టి పడిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.



కుప్పం టీడీపీ కార్యాలయం ఎదుట పోలీసు నిఘా

గ్రామాలలో పెరుగుతున్న ఉద్రిక్తత

కుప్పంలో గొడవలకు పేరుపడ్డ ప్రాంతాలైన కొత్తపేట, పాతపేట, బాబునగర్ వంటి చోట్ల ఇప్పటికే పోలీసులు తగు నిఘా ఏర్పాటు చేశారు. టీడీపీ, వైసీపీ కార్యాలయాలు, ఎమ్మెల్సీ భరత్ నివాసం, ముఖ్య ప్రాంతాలలోనూ బందోబస్తు ఉంచారు. గ్రామాలమీద పోలీసులు ఇంకా తగినంత ఫోకస్ పెట్టినట్లు కనిపించడంలేదు. అందుకనే గ్రామస్థాయిలో దాడులు జరుగుతూ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కువగా ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు నివశిస్తుంటారు. పార్టీలు ఏవైనా సరే, వీరిమధ్య చాలా వరకు పరస్పర అవగాహన, కలిసిమెలిసి పనిచేసే తత్వం ఉంటుంది. కానీ పల్లెల్లో ఈ గుణం చాలా తక్కువ. స్థానిక సంస్థల ఎన్నికలప్పుడు ఏర్పడ్డ ఘర్షణ జ్వాలలు ఇంకా రగులుతూనే ఉన్నాయి. అంతేకాక పోలింగ్ సమయంలోనూ ఇరు పార్టీ శ్రేణుల మధ్య పెద్ద గొడవలు జరుగకపోయినా, చాలాచోట్ల ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. కాబట్టి ఫలితాల సమయంలోనూ, తర్వాత కూడా గ్రామాలలో గొడవలు చోటు చేసుకునే ప్రమాదం అధికంగా ఉంటుంది. పోలీసులు అటువైపు కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు.

ఓట్ల లెక్కింపునకు సన్నద్ధం : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 2: జిల్లాలోని ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. ఆదివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వర్చువల్ విధానంలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై సమీక్షించారు. చిత్తూరు నుంచి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం కౌంటింగ్ పరిశీలకులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రెండో విడత ర్యాండమైజేషన్ చేశామని తెలిపారు. సోమవారం కౌంటింగ్ సిబ్బందికి ఎస్వీసెట్‌లో రెండో విడత శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. లెక్కింపు కేంద్రం ఆవరణలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.



రాజకీయ పార్టీల సమావేశంలో సూచనలిస్తున్న కలెక్టర్

పారదర్శక కౌంటింగ్‌కు సహకరించండి

ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ కోరారు. ఆదివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జిల్లాకు నియమితులైన ఐదుగురు కేంద్ర ఎన్నికల పరిశీలకులు, జేసీ శ్రీనివాసులు, రాజకీయల పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ సీసీ కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఏర్పాట్లు చేశామని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించరాదని, లెక్కింపు వ్యవహారంలో సందేహాలు వస్తే అక్కడి ఆర్వోలకు తెలియజేయాలని చెప్పారు. కౌంటింగ్ కేంద్రం ఆవరణలో విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు, ఊరేగింపులకు అనుమతి లేదన్నారు. డీఆర్వో పుల్లయ్య, రిటర్నింగ్ అధికారులు, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్, వివిధ పార్టీల ప్రతినిధులు అట్లూరి శ్రీనివాసులు, గంగరాజు, పరదేశి, రాహుల్, కౌంటింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

రూ.10 లక్షల నగదు సీజ్

చిత్తూరు, జూన్ 2: ఎలాంటి రసీదులూ లేకుండా తీసుకెళుతున్న నగదును రెండో పట్టణ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఉలసయ్య వివరాల మేరకు.. డీఐ రోడ్డులోని తోటపాళ్యం క్రాస్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. చిత్తూరు మండలం పచ్చనపల్లెకు చెందిన జ్ఞానశేఖర్‌రెడ్డి(48) ఎలాంటి రసీదులూ లేకుండా రూ. 10 లక్షలు తీసుకెళుతుండగా స్వాధీనం చేసుకుని, ఖజానా శాఖకు అప్పగించారు. ఆధారాలు చూపించి డబ్బు తీసుకోవాలని సూచించారు.

గూడ్స్ ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



కుప్పం, జూన్ 2: కుప్పం రైల్వే స్టేషన్ ఎదురుగా ఆదివారం రాత్రి గూడ్స్ రైలు ఢీకొని యువకుడు మృతి చెందాడు. రైల్వే టికెట్ కోసం పట్టాలు దాటుతుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకున్నట్లు చూసినవారు చెబుతున్నారు. మృతదేహం వద్ద లభించిన గుర్తింపు కార్డును బట్టి, మృతుడిని రామకుప్పం మండలం బగలనత్తం గ్రామవాసి శశికుమార్‌గా గుర్తించారు. ఇతడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ రెండురోజుల క్రితం సొంత గ్రామానికి వచ్చారు. తిరిగి బెంగళూరు వెళ్లడానికి ఆదివారం రాత్రి కుప్పం రైల్వేస్టేషన్ చేరుకుని, కౌంటర్లో టికెట్ తీసుకున్నారు. ఇంతలో రైలు రావడం గమనించి, పట్టాలమీదుగా ఒకటో ప్లాటుఫామ్ నుంచి రెండవ ప్లాట్‌ఫామ్‌కు పట్టాల మీదుగా వెళ్ళడానికి ప్రయత్నించారు. అదే సమయంలో వేగంగా వస్తున్న గూడ్స్ రైలు ఢీకొనడంతో శశికుమార్ అక్కడికక్కడే మృతి చెందారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.54 కోట్లు

తిరుమల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.54 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించి టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది.

గంధమనేని శివయ్య సతీమణి మృతి

పిచ్చాటూరు, జూన్ 2: పుత్తూరు మాజీ ఎమ్మెల్యే దివంగత గంధమనేని శివయ్య సతీమణి పారిజాతమ్మ(84) ఆదివారం సాయంత్రం మృతి చెందారు. పిచ్చాటూరు మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన గంధమనేని శివయ్య సీపీఐకి 1970వ దశకంలో కీలక నేతగా వ్యవహరించారు. 1972-77 మధ్యకాలంలో ఈయన పుత్తూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. శివయ్య సతీమణి పారిజాతమ్మ వృద్ధాప్య రీత్యా ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు చెన్నైలో కన్ను మూసినట్లు కుమారుడు గంధమనేని గౌతమ్ వెల్లడించారు. అంత్యక్రియలు సోమవారం సాయంత్రం చెన్నై కోడంబాక్కం ఎన్టీఆర్ స్ట్రీట్‌లోని స్వగృహంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



పారిజాతమ్మ (ఫైల్ ఫొటో)

చంద్రగిరి భద్రతపై ప్రత్యేక దృష్టి

- ప్రతి రెండు గ్రామాలకో సాయుధ బలగంతో కూడిన పెట్రోలింగ్ పార్టీ
- అదనంగా రెండు గ్రేహౌండ్స్ పార్టీలు
- ఈవీఎంల భద్రతకు ఢోకా లేదు
- ఇప్పటికే అదుపులో 200 మంది కీలక ట్రబుల్ మాంగర్స్
- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 2: పద్మావతి మహిళా వర్సిటీ స్ట్రాంగ్ రూమ్‌లోని పోల్డ్ ఈవీఎంల భద్రతకు ఎలాంటి ఢోకా లేదని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చెప్పారు. ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ప్రధానంగా కౌంటింగ్ కేంద్రం వద్ద అల్లర్లు, గొడవలు జరగకుండా ఉండటానికి పటిష్ట చర్యలు తీసుకున్నామని చెప్పారు. జిల్లా ప్రజలు చాలా మంచి వారన్నారు. అటువంటి వారిని కొందరు నాయకులు, వారి అనుచరులు రెచ్చగొట్టి గొడవలకు ప్రేరేపిస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే కౌంటింగ్ ప్రక్రియకు ఇబ్బందులు సృష్టిస్తారని భావించిన దాదాపు 200 మంది కీలక వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇక చంద్రగిరి నియోజకవర్గంలో భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఇక్కడ ఓ అదనపు ఎస్పీ పర్యవేక్షణలో ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు, 200 మంది బలగాలను నియమించామన్నారు. వీరు కాకుండా రెండు గ్రేహౌండ్స్ పార్టీలను కేటాయించామన్నారు. వీరివద్ద లాఠీలతో పాటు తుపాకులూ ఉంటాయన్నారు. అలాగే ప్రతి రెండు గ్రామాలకో సాయుధ బలగంతో కూడిన పెట్రోలింగ్ పార్టీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎక్కడ అల్లర్లు జరిగినా 10 నిమిషాల వ్యవధిలోనే సంబంధిత ప్రాంతాలకు చేరుకునేలా బలగాలను సిద్ధం చేసినట్లు తెలిపారు.

శ్రుతి మించితే లాఠీలకు పని చెప్పండి

కౌంటింగ్‌కు ఇబ్బందులు కల్గించేలా వ్యవహరిస్తూ.. శ్రుతిమించే పరిస్థితులొస్తే మాత్రం లాఠీలకు పనిచెప్పాలని సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. ఆదివారం మహిళా వర్సిటీలో పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేశాకే నిర్దేశిత గేట్ల ద్వారా కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించాలన్నారు. మీడియా పాయింట్ వరకు కెమెరాలు, మొబైల్ ఫోన్లను అనుమతించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ వెనుక తుమ్మలగుంట రోడ్డు వైపు ఉన్న పార్టీలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా పరువు పోకుండా ప్రజా ప్రతినిధులు సహకరిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ అధికారి సరిత, అదనపు ఎస్పీలు కులశేఖర్, విమలకుమారి, వెంకట్రావు, సాయుధ దళం అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.



అబ్జర్వర్‌కు వివరాలు తెలియజేస్తున్న ఎస్పీ, కలెక్టర్

స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన అబ్జర్వర్

తిరుపతి(నేరవిభాగం/కలెక్టరేట్), జూన్ 2: తిరుపతిలో కౌంటింగ్ పరిశీలన కోసం నియమితులైన స్పెషల్ పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రాకు ఆదివారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పద్మావతి మహిళా వర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఏర్పాట్లను అబ్జర్వర్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ, కలెక్టర్‌కు ఆయన పలు సూచనలిచ్చారు.

ఇద్దరు వ్యక్తుల దుర్మరణం

- స్కూటర్‌ని ఢీకొన్న గుర్తు తెలియని వాహనం



చంద్రగిరి, జూన్ 2: చంద్రగిరి మండలం, కోదండరామాపురం వద్ద పూతలపట్టు, నాయుడుపేట జాతీయ రహదారిలో ఆదివారం రాత్రి స్కూటర్‌ని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీ ఎన్టీఆర్ కాలనీకి చెందిన అమ్ములు(38), ఎస్వీ నగర్‌కు చెందిన విశ్వం(28) తిరుపతి వ్యవసాయ కళాశాలలోని మెస్‌లో కార్మికులుగా పనిచేస్తున్నారు. సొంత పనుల నిమిత్తం చిత్తూరుకు స్కూటర్‌పై వెళ్ళి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో కోదండరామాపురం వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈప్రమాదంలో అమ్ములు, విశ్వం తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతి చెందారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

31మంది టీడీపీ నేతలకు బెయిల్ మంజూరు

హత్యాయత్నం కేసులో ఊరట

తిరుపతి(నేరవిభాగం), జూన్ 2: తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీ, స్విమ్స్ ఆస్పత్రి వద్ద జరిగిన గొడవల్లో 37మంది టీడీపీ నేతలపై నమోదైన హత్యాయత్నం కేసులో 31 మందికి బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. మిగిలినవారు విదేశాల్లో ఉండటంతో వీరు బెయిల్ పిటిషన్ వేయలేదు. వివరాలిలా.. పద్మావతి మహిళా వర్సిటీ, స్విమ్స్ ఆస్పత్రి వద్ద మే 14వ తేదీన టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య గొడవలు, ఘర్షణలు, విధ్వంసాలు చోటు చేసుకున్నాయి. దీనిపై టీడీపీ నాయకులు కొందరు తమపై దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ గత నెల 26వ తేదీన తిరుపతి శివారు ప్రాంతమైన తిరుమలనగర్‌కు చెందిన వైసీపీ కార్యకర్త ఎ.రాజీవ్ ఎస్వీయూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటన జరిగిన 12 రోజుల తర్వాత ఫిర్యాదు చేస్తే.. పోలీసులు కనీసం విచారించకుండా తమపై అన్యాయంగా హత్యాయత్నం కేసు నమోదు చేశారని బెయిల్ పిటిషన్‌లో టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత 31మందికి షరతులతో కూడి న బెయిల్‌ని హైకోర్టు మంజూరు చేసింది. 'బెయిల్ మంజూరైన వారంతా ఈనెల 7వ తేదీ వరకు చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో తిరగకూడదు. కౌంటింగ్ ప్రక్రియలో ఏజెంట్లుగా ఉండకూడదు. ఈనెల 13వ తేదీ వరకు ప్రతి మూడ్రోజులకోసారి రేణిగుంట పోలీసు స్టేషన్‌లో హాజరై, సంతకాలు చేయాలి' అని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. తదుపరి కేసు విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసింది.

12న కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డుల పంపిణీ

చిత్తూరు కల్చరల్, జూన్ 2: చిత్తూరులోని రాజామహల్ హోటల్‌లో ఈ నెల 12న ఉదయం 11 గంటలకు కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డులను పంపిణీ చేయనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కె. రామలక్ష్మి ఆదివారం తెలిపారు. కుప్పం రెడ్డెమ్మ జాతీయ స్థాయి నవల, కథానికల పోటీలకు 2023వ సంవత్సరంలో వివిధ మాధ్యమాల్లో ప్రచురితమై మన్ననలు పొందిన రచనలకు బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వీటిలో.. నవలల విభాగంలో కె.ఎ.మునిసురేష్‌పిళ్లై రచించిన పుత్రిక శత్రు, సి.కాశిపురం ప్రభాకర్‌రెడ్డి రచించిన మేడం ఎంపికయ్యాయని సంస్థ అధ్యక్షురాలు డా.పి.రోజాప్రియ పేర్కొన్నారు. కథానికల పోటీలలో రోహిణి పంజారి రచించిన నల్ల సూరీడు, డాక్టర్ ఎం.సుగుణరావు రచించిన సుగణకథాభిరామం ఎంపికైనట్లు సంస్థ కార్యదర్శి డా.సి.నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, జూన్ 2: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి, వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శన టిక్కెట్ల ద్వారా 1,610మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 2,830మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,962మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,089, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 272మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 251మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 66మంది భక్తులు పూజలు రాహుకేతు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 17,319 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.



రాహుకేతు మండపం వద్ద భక్తులు

ఆగని గజదాడులు

పంటలపై స్వైరవిహారం - పొలాల వద్ద రైతుల కాపలా

సోమల, జూన్ 2: సోమల మండలంలో ఏనుగులు దాడులు ఆగడంలేదు. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. శనివారం రాత్రి పేటూరు పంచాయతీలో సంచరించిన ఏనుగులు మామిడి తోటల్లో కోతకు సిద్ధంగా ఉన్న కాయలను తిన్నంత తిని తొక్కేశాయి. చెట్లను వేళ్లతో పెకలించాయి. తోటల్లోని బోరు పైపులు, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. పేటూరు చెందిన చిట్టి, విష్ణు, ప్రసాద్, సుబ్రమణ్యం, చంద్ర తదితరుల టమోటా, మామిడి పంటలలో విధ్వంసం సృష్టించాయి. ఇరికిపెంట పంచాయతీ, నంజంపేట పంచాయతీల్లో మరో ఏనుగుల మంద తోటలో కోతకు సిద్ధంగా ఉన్న మల్లికా రకం, బేనిషా మామిడి పండ్లను తిన్నంతా తిని కొమ్మలను ధ్వంసం చేసి, డ్రిప్ పరికరాలను తొక్కి నాశనం చేశాయి. సరస్వతీపురానికి చెందిన చిన్నయ్య టమోటాలను కోత కోసి ఆదివారం మార్కెట్‌కు తరలించేందుకు పొలం వద్దనే టమోటా బాక్సులను నిల్వ చేశాడు. జంట ఏనుగులు ఆమార్గంలో వచ్చి టమోటాను ధ్వంసం చేసి వెళ్లాయి. ఆ సమీపంలోనే వరి పొలంలో సంచరించి నష్ట పరిచాయి. నెల రోజులుగా పులిచెర్ల, సదుం మండలాల వైపు వెళ్లిన ఏనుగులు మళ్లీ మామిడి కోతల సమయంలో మండలంలో ప్రవేశించడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఆవులపల్లె, పెద్దఉప్పరపల్లె, పేటూరు, అన్నెమ్మగారిపల్లె పంచాయతీల్లో అధికంగా బేనిషా, మల్లిక రకం, నీలం రకం మామిడి కోతలు చేయాల్సి ఉంది. రెడ్డివారిపల్లె, కొత్తూరు, పట్రపల్లె ప్రజలు పొలాల వద్ద అగ్గి మంటలు వేసుకొని జాగరణ చేస్తున్నారు.

అధికారులకు సమాచారం ఇచ్చినా వారు స్పందించడం లేదని రైతులు వాపోతున్నారు. దుర్గంకొండ, బోనమంద, పట్రపల్లె అటవీ ప్రాంతం నుంచి వెదురు అక్రమంగా తరలిపోతున్నా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.



పేటూరు వద్ద మామిడి తోటలో కొమ్మలను విరిచేసిన ఏనుగులు

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కొత్త వ్యక్తుల సంచారంపై నిఘా



పెద్దఉప్పరపల్లెలో కౌన్సిలింగ్ ఇస్తున్న పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్

సోమల, జూన్ 2: సమస్యాత్మక గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్, సోమల ఎస్ఐ వెంకట నరసింహులు కోరారు. ఆదివారం మండలంలోని సమస్యా త్మక గ్రామాల్లో ఏర్పాటు చేసిన పికెటింగ్‌ను ఆయన పరి శీలించారు. గ్రామస్థులకు పలు విషయాలపై కౌన్సిలింగ్ ఇచ్చారు. సారా అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పని సూచించారు. జూన్ 4వతేదీ వరకు ఎలాంటి ఉత్సవాలు, బాణ సంచా నిల్వలు చేయకూడదని తెలిపారు. మండలం లో 144 సెక్షన్‌పై అవగాహన కల్పించారు. అలాగే గ్రామాల్లో ఆట్లో పోలీసులు ప్రచారం జరిపారు. కందూరు సంతలో పోలీసులు అవగాహన కల్పించారు.

యాదవ ప్రతిభా పురస్కారాల ప్రదానం



యాదవ విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న యాదవ ఉద్యోగ సంఘనాయకులు

పుంగనూరు రూరల్, జూన్ 2: పుంగనూరు పట్టణ, మండల పరిధిలోని యాదవ కుల విద్యార్థులకు యాదవ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఆదివారం స్థానిక కృష్ణమరెడ్డిపల్లె శ్రీకృష్ణదేవాలయంలో యాదవ ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. 2023-2024లో 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు టి. భాషితా యాదవ్ (592)కు రూ.3వేలు, కె.యశ్వీతయాదవ్(590)కు రూ.2 వేలు, పి.వెంకటేశ్‌యాదవ్(582)కు రూ.1000 ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మిగిలిన 40మంది విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా యాదవ ఉద్యోగ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ప్రతి యేటా 10వ తరగతితో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. సంఘ నాయకులు సుబ్రహ్మణ్యంయాదవ్, లింగమూర్తియాదవ్, భాస్కర్‌యాదవ్, బుడ్డన్న, మోహన్, గంగులమ్మ, మునిరాజ, ఆనంద్, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్రచికిత్సా శిబిరానికి అనూహ్య స్పందన



నేత్రపరీక్షలు చేస్తున్న డాక్టర్ మురళి

పలమనేరు, జూన్2: పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర చికిత్సా శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఎన్నికల కారణంగా రిక్రియేషన్ క్లబ్‌లో ఉచిత నేత్రచికిత్సా శిబిరం నిర్వహించలేదు. ఆదివారం నిర్వహించిన శిబిరంలో 72 మందికి చెన్నై శంకర నేత్రాలయ నేత్రవైద్యులు మురళి పరీక్షలు నిర్వహించారు. వారిలో 47 మందికి ఆపరేషన్లు అవసర మున్నట్లు గుర్తిం చారు. ఆపరేషన్లు చేసుకొనే వారికి చెన్నై శంకరనేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని, చెన్నై వెళ్లి రావడానికి ఉచిత వాహన సౌకర్యం కల్పిస్తామని నేత్రవైద్యులు మురళి తెలిపారు.

ముత్యాలమ్మ జాతరలో మాజీ మంత్రి అమర్



గంగవరం, జూన్2: మండలంలోని మేలుమాయి క్రాస్ వద్ద వెలసిన ముత్యాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. జాతరలో భాగంగా ఆదివారం అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు అమరనాథరెడ్డి తెలియజేశారు. ఈ పూజల్లో సోమశేఖర్ గౌడు, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గొల్లపల్లెమ్మ జాతర





బోణాలతో వస్తున్న మహిళలు(ఇన్‌సెట్లో) ప్రత్యేక అలంకరణలో గొల్లపల్లెమ్మ

రొంపిచెర్ల, జూన్ 2: మండలంలోని గానుగ చింత పంచాయతీ దాసరిగూడెంలో గొల్లపల్లెమ్మ జాతర పురస్కరించుకొని విశేష పూజలు చేశారు. పొంగళ్లతో మహిళలు ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తర్వాత అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

గొల్లపల్లెమ్మ జాతర కోసం..

దాసరిగూడెంలో 260 కుటుంబాలు ఉన్నాయి. వీరు జీవనోపాధికి ఇతర ప్రాంతాలకు వెళ్లి అప్పుడప్పుడు కొన్ని రోజులు వచ్చి తిరిగి వెళుతుంటారు. వీరు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ఒడిశా రాష్ట్రాలకు వెళ్లి పురుషులు పండ్ల మొక్కల వ్యాపారం, మహిళలు గిల్ట్ నగలు, గాజులు వంటి వ్యాపారాలు చేస్తారు. అమ్మవారికి పూజలు చేసి దర్శించుకొని వెళితే మంచి జరుగుతుందని వారి విశ్వాసం. అందుకే గొల్లపల్లెమ్మ జాతరకు వారం ముందుగా గ్రామంలోని వారంతా ఇళ్లకు చేరుకుంటారు.

ఘనంగా పెద్దపల్లె గంగమ్మ ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో పెద్దపల్లె గంగమ్మ

గుడుపల్లె, జూన్ 2: మండలంలోని కుప్పిగానిపల్లెలో ఆదివారం పెద్దపల్లె గంగమ్మ ఊరేగింపు వైభవంగా జరిగింది. కుప్పిగానిపల్లె గ్రామంలో వెలసిన పెద్దపల్లె గంగమ్మ ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని అర్చకులు సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అమ్మవారిని రంగురంగు పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెద్దపల్లె గంగమ్మ ఉత్సమూర్తులను పట్టువస్త్రాలు, పూలతో అలంకరించారు. ఆ తరువాత గ్రామంలో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. మహిళలు స్వామివారికి హారతులిచ్చి మొక్కుకున్నారు. ఈ ఉత్సవాన్ని చూసేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సుభద్ర కల్యాణం

సోమల, జూన్ 2: భారతంమిట్టలో జరుగుతున్న మహాభారత యజ్ఞం సందర్భంగా ఆది వారం సుభద్ర కల్యాణ ఘట్టం హరికథాగానం భక్తులను ఆకట్టుకుంది. ఆవులపల్లె క్రిష్ణప్ప కుటుంబసభ్యులు అభిషేక పూజలు జరిపారు. రాత్రి పీలేరు వెంకటేశ్వర నాటక మండలి సభ్యులు నాటక ప్రదర్శనతో భక్తులను అలరించారు. పలువురు భక్తులు యజ్ఞ నిర్వాహకులకు విరాళాలు అందజేశారు.

నిలకడగా టమోటా ధరలు

సోమల, జూన్ 2: టమోటా ధరలు ఆదివారం 15కిలోల బాక్సు రూ.460కి చేరుకుంది. నాణ్యత ఉన్న టమోటాలు రూ.460 పలుగ్గా రెండో రకం కాయలు రూ.300 మాత్రమే పలికాయి. మార్చి నెలలో నాట్లు వేసిన తోటల్లో కాయలు మార్కెట్‌కు వస్తున్నాయి. పెద్దఉప్పరపల్లె, సోమల, నడింపల్లె, ఇరికిపెంట, కందూరు, నెల్లిమందలో వంద ఎకరాల్లో దిగుబడులు వస్తున్నాయి.

అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదు



కల్లూరులో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

కల్లూరు, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా రాజకీయ నాయకులు, కార్యకర్తలు అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కల్లూరు సీఐ శ్రీనివాసులు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు బస్టాండు కూడలిలో ఆదివారం సాయంత్రం సీఐ శ్రీనివాసులు సాయుధ బలగాలతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా కవ్వింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజలు రోడ్లపై గుమికూడటం, ర్యాలీలు చేయడం, సమావేశాలు నిర్వహించడం నిషేధమన్నారు. టపాకాయల విక్రయాలపై నిషేధం విధించామని, టపాకాయలు కాల్చినవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భగవద్గీత పఠనంతో జ్ఞానోదయం



పెద్దగొటిగల్లులో భగవద్గీత ప్రచారం

రొంపిచెర్ల, జూన్2: భగవద్గీత పఠనంతో మనశ్శాంతితో పాటు జ్ఞానోదయం కలుగుతుందని నెల్లూరు సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి సభ్యులు అన్నారు. ఆదివారం పెద్దగొట్టిగళ్లు, బొమ్మయ్యగారిపల్లె, బలిజపల్లె, మిట్టమీద పల్లె తదితర గ్రామాల్లో భగవద్గీత ప్రచారం చేశారు. కరపత్రాలు, పుస్తకాలు పంపిణీ చేశారు.

టీడీపీ విజయం తథ్యం
పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్

పాలసముద్రం, జూన్ 2: ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి, పార్టీ అధినేత చంద్రబాబు సీఎం కావడం తథ్యమని పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం పాలసముద్రంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడును ఆయన కలిశారు. జగన్ అరాచక పాలన ముగిసిందని, ఈ విషయం ఎగ్జిట్ పోల్స్‌తో తేటతెల్లమైందని అన్నారు. వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా రాదని తెలిపారు.

మోహిని అవతారంలో వేణుగోపాలుడు

కార్వేటినగరం, జూన్ 2: స్థానిక వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారు మోహిని అవతారంలో పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయంలో స్వామికి స్నపన తిరుమంజనం, ఊంజల సేవ నిర్వహించారు. రాత్రి గరుడ వాహనంపై ముద్దుగోపాలుడు తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

చల్లబడిన వాతావరణం





కుప్పంలో కూలిన టైల్స్ షెడ్డు, బైరెడ్డిపల్లె మండలం టీఎన్‌కుప్పం గ్రామం వద్ద విద్యుత్ తీగలపై పడిన టేకు చెట్టు

గాలివానకు కూలిన టైల్స్ షెడ్

కుప్పం, జూన్ 2: కుప్పంలో శనివారం రాత్రి కురిసిన గాలివానకు ఒక టైల్స్ షెడ్డు కూలిపోయి యజమానికి భారీ నష్టం మిగిల్చింది. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని వడ్డెపల్లెలో చాముండేశ్వరీ ట్రేడర్స్‌కు చెందిన రేకుల్ షెడ్డు నిలువునా కూలింది. దీనివల్ల తాను రూ.10 లక్షల దాకా నష్టపోయాయని యజమాని దేవా ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం సాయం చేయాలని ఆయన అభ్యర్థించారు.

కూలిన వృక్షం..విరిగిన విద్యుత్ స్తంభం

పలమనేరు: బైరెడ్డిపల్లి మండలం టీఎన్‌కుప్పం గ్రామం వద్ద శనివారం రాత్రి కురిసిన గాలివానకు చక్రపాణిరెడ్డి అనే రైతు పొలం వద్ద ఉన్న టేకు చెట్టు కూలిపోయింది. ఆ చెట్టు సమీపంలోని విద్యుత్ తీగలపై పడటంగో 33 కేవీ విద్యుత్ స్తంభం పైభాగం విరిగిపోయింది. దీంతో ఆ సమీప పొలాల రైతులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు స్పందించి మరో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

కూల్‌కూల్‌గా.. పలమనేరు

చిత్తూరు జిల్లాలోనే పేదల ఊటీగా పిలువబడే పలమనేరు చల్లబడింది. నాలుగురోజులుగా ఎండలు మండిపోవడంతో ఇక్కడ కూడా పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు మించిపోయాయి. దీంతో ఎన్నడూ లేనివిధంగా వేడి పెరిగిపోవడంతో పట్టణ వాసులతో పాటు పరిసరగ్రామాల ప్రజలు అల్లాడిపోయారు. అయితే శనివారం రాత్రి, ఆదివారం సాయంత్రం కురిసిన వర్షాలతో పలమనేరు చల్లబడింది. ఈ వర్షం పలమనేరు చుట్టుపక్కల సుదూర ప్రాంతాల్లోకూడా కురవడంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. దీంతో బాటు ఒకటి రెండు రోజుల్లోనే నైరుతి రుతుపవనాలు ప్రవేశించనున్నట్లు వార్తలు రావడంతో ఇక ఈ ఏడాదికి ఇక వేసవికి వీడ్కోలు పలికినట్లే నని ప్రజలు సంతోషపడుతున్నారు.

పుంగనూరులో వర్షం ఉక్కపోత నుంచి ఉపసమనం

పుంగనూరు రూరల్: పుంగనూరులో ఉదయం నుంచి ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం వాతావరణం మారిపోయింది. కొద్దిపాటి వర్షం కురవడంతో ప్రజలు ఉక్కపోత నుంచి కాస్త ఊరటచెందారు. ఈ వర్షం కురవడంతో వేరుశనగ విత్తనాలు వేయడానికి ఉపయోగం ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా వర్షం కురవడంతో ప్రభుత్వ ఆస్పత్రి మార్గంలో వర్షపు నీరు నిల్వతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు.





పలమనేరు, పుంగనూరుల్లో ఆదివారం సాయంత్రం కురుస్తున్న వర్షం

ఎండల తీవ్రతతో కూలీల ఇక్కట్లు..!

సోమల, జూన్ 2: మూడు రోజులుగా పెరిగిన ఎండల తీవ్రతలతో పనులకు వెళ్లి రైతులు, కూలీలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఆదివారం ఎన్నడూ లేని విధంగా సోమలలో 38 నుంచి 40 డిగ్రీలకు ఎండ మించింది. ఉదయం 10 గంటల నుంచే అధిక ఉష్ణోగ్రతలతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలో టమోటా సీజన్‌తో పాటు మామిడి కోతలకు కూలీల కొరత తీవ్రంగా ఏర్పడింది. అసాధరణ ఎండలతో పాటు వడగాల్పు వీచడంతో కూలీలు ఇబ్బందులు పడ్డారు. వృద్ధులు, చిన్నారులు ఇళ్లకే పరిమితమయ్యారు. కూలీలు ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి ఒంటి గంట వరకు పనులు చేస్తున్నారు. ప్రస్తుతం వరి కోతలు సైతం జరుగుతున్నాయి. ఈ క్రమంలో కూలీల కొరత తీవ్రంగా ఉంది. అధిక ఉష్ణోగ్రతలతో టమోటా తోటలు వాడిపోతున్నాయి. దీంతో మొక్కలపై నీటిని స్ప్రేయింగ్ చేస్తున్నారు. కాగా మధ్యాహ్నం పెద్దఉప్పరపల్లెలో ఓ మోస్తారు వర్షం కురిసింది. సోమల, నంజంపేటల్లో సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతంగా మారింది. వర్షం మాత్రం కురవలేదు.

ప్రశాంతత కోసం అన్ని పార్టీలూ సహకరించాలి



వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ

చౌడేపల్లె, జూన్2: ప్రశాంత వాతావరణం కోసం అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్ కోరారు. ఆదివారం ఆయన మండలంలోని దాదేపల్లె, తెల్లనీళ్లపల్లె గ్రామాలలో ప్రజలతో, ప్రధాన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్న ప్రజలు, రాజకీయ నాయకులు సంయమనం పాటించి ప్రశాంతంగా ఉండాలని కోరారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, పోలీస్ 30 యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉందని తెలియజేశారు. ప్రజలు, నాయకులు ర్యాలీలు చేయటం, టపాకాయలు పేల్చడం ఈనెల 6 వరకు నిషేధమన్నారు. అలాగే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రధాన రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రశాంత వాతావరణం కోసం సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి



పుంగనూరు రూరల్, జూన్2: స్థానిక మేలుపట్ల సమీపంలో నూతనంగా నిర్మించిన వీరాంజనేయస్వామి ఆదివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయాన్ని నిర్మించి 41రోజులు పూర్తి కావడంతో ఆలయంలో హోమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు, అలంకరణలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళా భక్తులు అధికసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

రాళ్లగంగమాంబకు కిరీటం బహూకరణ



గుడుపల్లె, జూన్ 2: మండల కేంద్రంలోని ప్రసన్న రాళ్లగంగమాంబకు తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా కదిరి కుప్పంకు చెందిన మారిశెట్టి, చిన్నతాయమ్మ కుటుంబ సభ్యులు వెండి కిరీటం, బంగారు తాళిబొట్టు, నోము ముడిని కానుకగా అందజేశారు. ఆదివారం ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలకు వీటిని అందించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి అనంతరం ఆభరణాలను అలంకరించారు.

ట్రాఫిక్ ఆంక్షలు పాటించకపోతే చర్యలు: ఎస్పీ

చిత్తూరు, మే 31: ఈనెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కారణంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించామని, వాటిని ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్పీ మణికంఠ చందోలు కోరారు. ఆ రోజున ఉదయం 4 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు. చిత్తూరు నుంచి తిరుపతి, కడప, పీలేరు లేదా హైదరాబాదుకు వెళ్లాల్సిన వారు ఇరువారం వైపుగా, వరిగపల్లె జంక్షన్ మీదుగా సిక్స్‌లేన్ హైవేపై వెళ్లాలని తెలిపారు. చెన్నై, వేలూరు నుంచి చిత్తూరు మీదుగా తిరుపతి, కడప, పీలేరు, హైదరాబాదు వెళ్లాలనుకునేవారు రెడ్డిగుంట జంక్షన్ నుంచి వరిగిపల్లె(కాఫీడే) జంక్షన్ వద్దకు వెళ్లి అక్కడి నుంచి సిక్స్‌లేన్ హైవేలో వెళ్లాలని సూచించారు. తిరుత్తణి నుంచి చిత్తూరు మీదుగా తిరుపతికి వెళ్లాల్సిన వారు తానా జంక్షన్ నుంచి జీడీ నెల్లూరు పోలీసు స్టేషన్ మీదుగా పుత్తూరు రోడ్డును వినియోగించుకోవాలన్నారు. కడప-పీలేరు-తిరుపతి నుంచి చిత్తూరుకు రావాలనుకున్న వారు రంగంపేట సిక్స్‌లేన్ హైవేపై వరిగపల్లె జంక్షన్ మీదుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. వావిల్‌తోట-బండపల్లె-పూతలపట్టు మండలం, సమీప గ్రామాల ప్రజలు చిత్తూరుకు వరిగపల్లె మీదుగా రావాలని కోరారు. తిరుపతి నుంచి చిత్తూరుకు వచ్చేవారికి పెనుమూరు రోడ్డు పూర్తిగా నిషేధించినట్లు చెప్పారు. రంగంపేట ఫ్లైవోవర్ క్రాస్ నుంచి మురకంబట్టు వరకు వాహనాల రాకపోకలు పూర్తిగా నిషేధించినట్లు వెల్లడించారు. కౌంటింగ్ సిబ్బంది, అధికారులు, అభ్యర్థులను మాత్రమే ఎస్వీసెట్ వరకు అనుమతిస్తారని తెలిపారు. రెండవ గేట్ ద్వారా ఆర్వీఎస్ ఆస్పత్రి వెనుక వైపు ఖాళీ ప్రదేశంలో పార్కింగ్‌కు స్థలం కేటాయించామని చెప్పారు. ఏజెంట్లు, పోలీసులు, మీడియా వాహనాల కోసం మహర్షి పాఠశాల ఆవరణలో, పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. పూతలపట్టు నుంచి వచ్చే వాహనాలు ఎడమ వైపు సర్వీసు రోడ్డులో అండర్ పాస్ ద్వారా పార్కింగ్ ప్రదేశానికి చేరుకోవచ్చని వివరించారు. మురకంబట్టు నుంచి వచ్చే వాహనాలు కుడి మలుపు తిరిగి, ఆపై ఆర్వీఎస్ నర్సింగ్ కళాశాల హాస్టల్ వద్ద కుడి వైపు రహదారి నుంచి మహర్షి పాఠశాల పార్కింగ్ వద్దకు వెళ్లవచ్చునని తెలిపారు.

కౌంటింగ్ కేంద్రంలో.. పెండింగ్ పనులు పూర్తి చేయండి



కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జేసీ, ఎస్పీ

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 2: ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎస్వీసెట్‌లోని కౌంటింగ్ కేంద్రాల్లో పెండింగ్ పనులను సోమవారం ఉదయం లోగా పూర్తి చేయాలని జేసీ శ్రీనివాసులు, ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. ఆదివారం సాయంత్రం ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. బారికేడింగ్, ఫుడ్ కోర్టు, తాగునీరు, పారిశుధ్యం, పార్కింగ్, సీసీ కెమెరాలు, మీడియా సెంటర్, టేబుల్స్, కంప్యూటర్ల ఏర్పాటును పరిశీలించి అధికా రులకు సూచనలు చేశారు. ఏడు నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు సులభంగా చేరుకునే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మీడియా సెంటర్‌లో ఎల్ఈడీ స్ర్కీన్, టీవీలు, కంప్యూటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వారివెంట ఆర్వోలు, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఉమామహేశ్వర్ రెడ్డి, డీఎస్పీలు రాజగోపాల్ రెడ్డి, శరవణ పాల్గొన్నారు.

కర్ణాటకకు రేషన్ బియ్యం తరలింపు



పొగురుపల్లె ప్రధాన మార్గంలో కర్ణాటకకు ఆటోలో తరలుతున్న రేషన్ బియ్యం

గుడుపల్లె, జూన్ 2: మండలంలోని పొగురుపల్లె ప్రధాన మార్గంలో నిత్యం కర్ణాటకకు అక్రమంగా రేషన్ బియ్యం తరలుతోంది. కొంత మంది అక్రమార్కులు గ్రామాల్లోని రేషన్ షాపులో ప్రజలకు పంపిణీ చేసే బియ్యాన్ని వారి వద్ద కిలో రూ.20 తీసుకొని కర్ణాటక రాష్ట్రం బంగారుపేట పట్టణానికి వాహనాల్లో తరలిస్తూ అక్కడ కిలో బియ్యం రూ.30కు విక్రయిస్తున్నారు. నిత్యం కుప్పం నుంచి పొగురుపల్లె మీదుగా కర్ణాటక రాష్ట్రం బంగారుపేట తరలుతోంది. కర్ణాటకకు రేషన్ బియ్యం తరలించే వాహనాలు మితిమీరిన వేగంతో నడుస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ వాహనాల తరలింపు వల్ల ఇప్పటికే పలువురు ప్రమాదాలకు గురయ్యారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులు బియ్యాన్ని యథేచ్ఛగా తరలిస్తున్నారు.

భక్తులతో కిక్కిరిసిన బోయకొండ



చౌడేపల్లె, జూన్2: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఉదయం ఆలయంలో అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో ఆలయాన్ని శాస్త్రోక్తంగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు అర్చనలు చేసి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పిచారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచేగాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. అమ్మవారిని సుమారు 30వేల మంది భక్తులు దర్శించుకున్నారు. దర్శన టికెట్లు, వసతి గదులు, వివిధ సేవా టికెట్ల ద్వారా రూ.11.60లక్షల ఆదాయం చేకూరింది. భక్తుల ఏర్పాట్లను ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళిలు పర్యవేక్షించారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

టీడీపీ విజయం తథ్యం
- పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్



చిట్టిబాబును కలిసిన మురళీమోహన్

పాలసముద్రం, జూన్ 2: ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి, పార్టీ అధినేత చంద్రబాబు సీఎం కావడం తథ్యమని పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం పాలసముద్రంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడును ఆయన కలిశారు. జగన్ అరాచకపాలన ముగిసిందని, ఈ విషయం ఎగ్జిట్ పోల్స్‌తో తేటతెల్లమైందని అన్నారు. వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా రాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర చౌదరి, వాసుయాదవ్, వెంకటేశులు నాయుడు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

గుడిపాల, జూన్ 2: మండలంలోని మరకాలకుప్పంలో ఆదివారం జనజాగృతి స్వచ్ఛంద సంస్థ, వైదేహి హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. కీళ్లనొప్పులు, బీపీ, సాధారణ రుగ్మతలు, ఈసీజీ, ఎకో పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారులు నరేష్, ప్రజ్వల్, భార్గవి, జనజాగృతి కన్వీనర్ చిట్టిబాబు, వైదేహి హాస్పిటల్ కన్వీనర్ నానబాల లోకేష్, సమన్వయకర్త సాయిప్రతాప్ పాల్గొన్నారు.

వైభవంగా పొన్నియమ్మ మహోత్సవాలు



ప్రత్యేకాలంకారంలో పొన్నియమ్మ, వినాయకస్వామి

గుడిపాల, జూన్ 2: మండలంలోని చుక్కా వారిపల్లెలో ఆదివారం పొన్నియమ్మ, సెల్వ వినాయక 40వ మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి, అంబలి పోశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించి పుష్పపల్లకిలో ఊరేగించారు.పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

సర్వీసు రోడ్లను పునరుద్ధరించండి

గుడిపాల, జూన్ 2: మండలంలోని బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిలోని నంగమంగళం రైల్వేగేట్ రోడ్డు విస్తరణలో భాగంగా సర్వీసు రోడ్లను మూసేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బెంగళూరు నుంచి చెన్నై వెళ్లాలన్నా, గుడిపాల నుంచి నంగమంగళం వెళ్లాలన్నా అవస్థలు పడాల్సి వస్తోంది. ఎంసీఆర్ క్రాస్ రోడ్డు మీదుగా మళ్లించడం వల్ల ప్రయాణికులు, వాహనదారులు రెండింతల ఖర్చు భరించాల్సి వస్తోంది. నెలల తరబడి ఇబ్బంది పడుతున్నామని, హైవే అధికారులు స్పందించి, సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు.

కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్‌కు సన్మానం



గుణశేఖర్ రెడ్డిని సన్మానిస్తున్న ప్రభాకర్ రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 2: కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన గుణశేఖర్ రెడ్డి సేవలు ప్రశంసనీయమని జిల్లా మైనారిటీ శాఖ అధికారి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సంతపేటలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. 37ఏళ్లుగా వివిధ హోదాల్లో పనిచేసిన గుణశేఖర్ రెడ్డి ఉద్యోగులందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీకేబాబు, చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంసీ విజయానందరెడ్డి, తిరుపతి డీటీసీ బసిరెడ్డి, రిటైర్డ్ మేజర్ డిల్లీబాబు రెడ్డి, పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు.


రోడ్డుపైనే కోళ్ల వ్యర్థాలు



కార్వేటినగరం, జూన్ 2: కార్వేటి నగరం పంచాయతీ పరిధిలోని దొరవారిగుంట రోడ్డు మార్గంలో కోళ్ల వ్యర్థాలను పడేస్తుండడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. చికెన్ దుకాణాల వారు మిగిలిన వ్యర్థాలను రాత్రిపూట ఇక్కడ పడేస్తుండడం, కుక్కలు వాటిని చిందర వందరంగా లాగేస్తుండడంతో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారిపోతున్నాయి. పైగా అవి కుళ్లి దుర్వాసన వెదజల్లుతుండడంతో రోగాలు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

మోహిని అవతారంలో వేణుగోపాలుడు





మోహిని అవతారంలో ఊరేగుతున్న స్వామి వారు (ఇన్‌సెట్‌లో) స్నపన తిరుమంజనం

కార్వేటినగరం, జూన్ 2: స్థానిక వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారు మోహిని అవతారంలో పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయంలో స్వామికి స్నపన తిరు మంజనం, ఊంజల సేవ నిర్వహించారు. రాత్రి గరుడ వాహనంపై మువ్వగోపాలుడు తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు అర్పించారు.

ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి

పుంగనూరు రూరల్, జూన్2: స్థానిక మేలుపట్ల సమీపంలో నూతనంగా నిర్మించిన వీరాంజనేయస్వామి ఆది వారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయాన్ని నిర్మించి 41రోజులు పూర్తి కావడంతో ఆలయంలో హోమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు, అలంకరణలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళా భక్తులు అధికసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

చెత్త తొలగించండి



చెత్తతో నిండిపోయిన బావి

నింద్ర, జూన్ 2: మండల కేంద్రం నడిబొడ్డున పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. బస్టాండు వద్ద పురాతన తాగునీటి బావి ఉంది. గతంలో ప్రజలు ఈ బావి నీటినే వాడుకునేవారు. కాలక్రమేణా అది పూడిపోవడంతో చెత్తచెదారాలతో నిండిపోయింది. దోమలకు నిలయంగా మారి, దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు స్పందించి చెత్త తొలగించాలని కోరుతున్నారు.

డాక్టర్ రవిరాజుకు సన్మానం



రవిరాజుకు జ్ఞాపిక అందిస్తున్న ఎంపీటీసీ మురళీరెడ్డి

వెదురుకుప్పం, జూన్ 2: జిల్లా రిటైర్డ్ టీకా అధికారి డాక్టర్ రవిరాజును పెరుమాళ్లపల్లె ఎంపీటీసీ తోకల మురళీరెడ్డి ఆదివారం సన్మానించారు. ఉద్యోగ విరమణ చేసిన క్రమంలో శాలువ కప్పి, జ్ఞాపిక అందజేశారు. మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ



భీముడు, దుర్యోధనుడి యుద్ధ సన్నివేశం

శ్రీరంగరాజపురం, జూన్ 2 : మండలంలోని తయ్యూరు పాయకట్టు, అంకనపల్లె ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడి ఆధ్వర్యంలో 15 రోజులుగా నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాలు ఆదివారం దుర్యోధన వధ, పట్టాభిషేక మహోత్సవంతో ముగిశాయి. దుర్యోధన, భీమసేన పాత్రధారులు ప్రదర్శించిన యుద్ధ సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ద్రౌపదీ సమేత ధర్మరాజుల పట్టాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ధర్మకర్త లింగ రెడ్డి, నిర్వాహకులు రామనాథరెడ్డి, దామోదరాచారి, శంకర్‌రెడ్డి, అడ్వకేట్ గురవయ్య, పాల్గొన్నారు.

సుభద్ర కల్యాణం

సోమల, జూన్ 2: భారతంమిట్టలో జరుగుతున్న మహాభారత యజ్ఞం సందర్భంగా ఆది వారం సుభద్ర కల్యాణ ఘట్టం హరికథాగానం భక్తులను ఆకట్టుకుంది. ఆవులపల్లె క్రిష్ణప్ప కుటుంబసభ్యులు అభిషేక పూజలు జరిపారు. రాత్రి పీలేరు వెంకటేశ్వర నాటక మండలి సభ్యులు నాటక ప్రదర్శనతో భక్తులను అలరించారు. పలువురు భక్తులు యజ్ఞ నిర్వాహకులకు విరాళాలు అందజేశారు.

నిలకడగా టమోటా ధరలు

సోమల, జూన్ 2: టమోటా ధరలు ఆదివారం 15కిలోల బాక్సు రూ.460కి చేరుకుంది. నాణ్యత ఉన్న టమోటాలు రూ.460 పలుగ్గా రెండో రకం కాయలు రూ.300 మాత్రమే పలికాయి. మార్చి నెలలో నాట్లు వేసిన తోటల్లో కాయలు మార్కెట్‌కు వస్తున్నాయి. పెద్దఉప్పరపల్లె, సోమల, నడింపల్లె, ఇరికిపెంట, కందూరు, నెల్లిమందలో వంద ఎకరాల్లో దిగుబడులు వస్తున్నాయి.

యాదవ ప్రతిభా పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందజేస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

పుంగనూరు రూరల్, జూన్ 2: పుంగనూరు పట్టణ, మండల పరిధిలోని యాదవ కుల విద్యార్థులకు యాదవ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఆదివారం స్థానిక కృష్ణమరెడ్డిపల్లె శ్రీకృష్ణ దేవాలయంలో యాదవ ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. 2023-2024లో 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు టి. భాషితా యాదవ్ (592)కు రూ.3వేలు, కె.యశ్వితయాదవ్(590)కు రూ.2 వేలు, పి.వెంకటేశ్‌యాదవ్(582)కు రూ.1000 ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మిగిలిన 40మంది విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా యాదవ ఉద్యోగ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ప్రతియేటా 10వ తరగతితో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. సంఘ నాయకులు సుబ్రహ్మణ్యంయాదవ్, లింగమూర్తియాదవ్, భాస్కర్‌యాదవ్, బుడ్డన్న, మోహన్, గంగులమ్మ, మునిరాజ, ఆనంద్, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాళ్లగంగమాంబకు కిరీటం బహూకరణ



గుడుపల్లె, జూన్ 2: స్థానిక ప్రసన్న రాళ్లగంగమాంబకు తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా కదిరి కుప్పంకు చెందిన మారిశెట్టి, చిన్నతాయమ్మ కుటుంబ సభ్యులు వెండి కిరీటం, బంగారు తాళిబొట్టు, నోము ముడిని కానుకగా అందజేశారు. ఆదివారం ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలకు వీటిని అందించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకా లు, పూజలు నిర్వహించి అనంతరం ఆభరణాలను అలంకరించారు.

గాలివానకు కూలిన ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు



పెనుమూరులో కూలిన స్తంభం

పెనుమూరు, జూన్ 2: మండలంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. కే.వడ్డిపల్లిలో కే మునికృష్ణకు చెందిన పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు స్తంభం పక్కనే ఉన్న బావిలోకి ఒరిగిపోయాయి. మణియానంపల్లి, చెర్లోపల్లి, పైపల్లి, జట్టిగుండ్లపల్లి, ఉగ్రాణంపల్లి, గుద్యాణంపల్లి గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోయాయి. దీంతో చళంపాళ్యం, కలవగుంట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

10 స్తంభాలు నేలమట్టం

గుడిపాల : మండలంలోని ఏఎల్‌పురం, నారగల్లు, కుప్పిగానిపల్లి, గొల్లమడుగు తదితర ప్రాంతాల్లో 10 విద్యుత్ స్తంభాలు నేలమట్టమ య్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కుప్పిగానిపల్లి దళితవాడకు చెందిన సుభాషిణి ఇంటి పైకప్పు ధ్వంసమైంది. కొత్తపల్లి దళితవాడకు చెందిన చిన్నపయ్య మేక పిడుగుపాటుకు మృతిచెందింది. అరటి, మామిడికాయలు నేలపాలయ్యాయి.

విజేతలకు బహుమతుల ప్రదానం
ముగిసిన భగవద్గీత, విష్ణు సహస్రనామ స్తోత్రాల శిక్షణ



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసమూర్తి - గెలుపొందిన విద్యార్థులు

చిత్తూరు కల్చరల్, జూన్ 2: స్థానిక బ్రాహ్మణవీధి గీతాసంఘం భవనంలో పాఠశాల విద్యార్థులకు 40 రోజుల పాటు నిర్వహించిన ఉచిత భగవద్గీత, విష్ణుసహస్రనామ స్తోత్రాల శిక్షణా తరగతులు ఆదివారం ముగిశాయి. విజేతలకు గీతాసంఘం నిర్వాహకులు నారాయణమూర్తి, శ్రీనివాస్, రామాంజనేయులు శెట్టి బహుమతులు ప్రదానం చేశారు. భగవద్గీతలో సాయిస్కంధ(9వ తరగతి, బి.వి.రెడ్డి స్కూల్) మొదటి, లేఖ్య(9వ తరగతి - నారాయణ స్కూల్) ద్వితీయ, చూడామణి (9వ తరగతి- చైతన్య స్కూల్) తృతీయ బహుమతులు పొందారు. విష్ణుసహస్రనామ స్తోత్రాలలో రోహిత్(7వ తరగతి - దేవిబాలమందిర్) మొదటి, నారాయణ (9వ తరగతి - ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరిగపల్లె) ద్వితీయ, చరణిత సాయి (4వ తరగతి-విజ్ఞాన దీప్తి) తృతీయ బహుమతులు పొందారు. శిక్షకులు రామమూర్తి, నారాయణన్‌లను ఘనంగా సత్కరించారు.

బాలుపల్లెలో తాగునీటి కష్టాలు



వ్యవసాయ మోటారు వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్తులు

వెదురుకుప్పం, జూన్ 2: మండల పరిధిలోని బాలుపల్లెలో తాగునీటి కష్టాలు ఎక్కువయ్యాయి. ట్యాంకు నుంచి గ్రామంలోని 40 కుటుంబాల వారికి నీరు సరఫరా చేసేవారు. కొన్ని రోజుల క్రితం ట్యాంకుకు నీరు సరఫరా చేసే మోటారు మరమ్మతులకు గురైంది. ఈ క్రమంలో ఎన్నికల వరకు ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేశారు. తర్వాత అది కూడా నిలిపేశారు. వ్యవసాయ బావుల నుంచి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. సమస్యను సచివాలయ ఉద్యోగులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. పరిష్కరించకపోతే ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు.

కౌంటింగ్ కేంద్రంలో పెండింగ్ పనులు పూర్తి చేయండి



కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జేసీ, ఎస్పీ

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 2: ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎస్వీసెట్‌లోని కౌంటింగ్ కేంద్రాల్లో పెండింగ్ పనులను సోమవారం ఉదయం లోగా పూర్తి చేయాలని జేసీ శ్రీనివాసులు, ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. ఆదివారం సాయంత్రం ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. బారికేడింగ్, ఫుడ్ కోర్టు, తాగునీరు, పారిశుధ్యం, పార్కింగ్, సీసీ కెమెరాలు, మీడియా సెంటర్, టేబుల్స్, కంప్యూటర్ల ఏర్పాటును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఏడు నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు సులభంగా చేరుకునే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మీడియా సెంటర్‌లో ఎల్‌ఈడీ స్క్రీన్, టీవీలు, కంప్యూటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వారివెంట ఆర్వోలు, పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఉమామహేశ్వర్ రెడ్డి, డీఎస్పీలు రాజగోపాల్ రెడ్డి, శరవణ పాల్గొన్నారు.

ప్రవీణ్ క్రికెట్ లీగ్ విజేత జీడీనెల్లూరు జట్టు



విజేత జట్టుకు చెక్ అందజేస్తున్న చిట్టిబాబునాయుడు

గంగాధరనెల్లూరు, జూన్ 2: జీడీఎన్ ప్రవీణ్ క్రికెట్ లీగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గంగాధరనెల్లూరు జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా పూతలపట్టు జట్టు నిలిచింది. కడపగుంట జట్టు మూడో స్థానంలో నిలిచింది. పోటీలు నిర్వహించిన జీడీ నెల్లూరు హైస్కూల్ మైదానంలో ఆదివారం విజేతలకు టోర్నమెంట్ నిర్వాహకులు ప్రవీణ్, టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరంతో కలిసి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి భీమనేని చిట్టిబాబునాయుడు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ.30వేలు, రెండవ బహుమతి రూ.10వేలు, మూడవ బహుమతి కింద రూ.5వేలు అందజేశారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని, గ్రామీణ యువకులు ఆ దిశగా అడుగులు వేయాలన్నారు.

వైభవంగా గొల్లపల్లెమ్మ జాతర



బోనాలతో వస్తున్న మహిళలు

రొంపిచెర్ల, జూన్ 2: మండలంలోని గానుగ చింత పంచాయతీ దాసరిగూడెంలో గొల్లపల్లెమ్మ జాతర పురస్కరించుకొని విశేష పూజలు చేశారు. పొంగళ్లతో మహిళలు ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తర్వాత అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

గొల్లపల్లెమ్మ జాతర కోసం..

దాసరిగూడెంలో 260 కుటుంబాలు ఉన్నాయి. వీరు జీవనోపాధికి ఇతర ప్రాంతాలకు వెళ్లి అప్పుడప్పుడు కొన్ని రోజులు వచ్చి తిరిగి వెళుతుంటారు. వీరు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ఒడిశా రాష్ట్రాలకు వెళ్లి పురుషులు పండ్ల మొక్కల వ్యాపారం, మహిళలు గిల్ట్ నగలు, గాజులు వంటి వ్యాపారాలు చేస్తారు. అమ్మవారికి పూజలు చేసి దర్శించుకొని వెళితే మంచి జరుగుతుందని వారి విశ్వాసం. అందుకే గొల్లపల్లెమ్మ జాతరకు వారం ముందుగా గ్రామంలోని వారంతా ఇళ్లకు చేరుకుంటారు.

పెద్దపల్లె గంగమ్మ ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో పెద్దపల్లె గంగమ్మ

గుడుపల్లె, జూన్ 2: మండలంలోని కుప్పిగానిపల్లెలో ఆదివారం పెద్దపల్లె గంగమ్మ ఊరేగింపు వైభవంగా జరిగింది. కుప్పిగానిపల్లె గ్రామంలో వెలసిన పెద్దపల్లె గంగమ్మ ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని అర్చకులు సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అమ్మవారిని రంగురంగు పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెద్దపల్లె గంగమ్మ ఉత్సమూర్తులను పట్టువస్త్రాలు, పూలతో అలంకరించారు. ఆ తరువాత గ్రామంలో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. మహిళలు స్వామివారికి హారతులిచ్చి మొక్కుకున్నారు. ఈ ఉత్సవాన్ని చూసేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కర్ణాటకకు రేషన్ బియ్యం తరలింపు



పొగురుపల్లె ప్రధాన మార్గంలో కర్ణాటకకు ఆటోలో తరలుతున్న రేషన్ బియ్యం

గుడుపల్లె, జూన్ 2: మండలంలోని పొగురుపల్లె ప్రధాన మార్గంలో నిత్యం కర్ణాటకకు అక్రమంగా రేషన్ బియ్యం తరలుతోంది. కొంత మంది అక్రమార్కులు గ్రామాల్లోని రేషన్ షాపులో ప్రజలకు పంపిణీ చేసే బియ్యాన్ని వారి వద్ద కిలో రూ.20 తీసుకొని కర్ణాటక రాష్ట్రం బంగారుపేట పట్టణానికి వాహనాల్లో తరలిస్తూ అక్కడ కిలో బియ్యం రూ.30కు విక్రయిస్తున్నారు. నిత్యం కుప్పం నుంచి పొగురుపల్లె మీదుగా కర్ణాటక రాష్ట్రం బంగారుపేట తరలుతోంది. కర్ణాటకకు రేషన్ బియ్యం తరలించే వాహనాలు మితిమీరిన వేగంతో నడుస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ వాహనాల తరలింపు వల్ల ఇప్పటికే పలువురు ప్రమాదాలకు గురయ్యారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులు బియ్యాన్ని యథేచ్ఛగా తరలిస్తున్నారు.

భక్తులతో కిక్కిరిసిన బోయకొండ



చౌడేపల్లె, జూన్2: బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఉదయం ఆలయంలో అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో ఆలయాన్ని శాస్త్రోక్తంగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు అర్చనలు చేసి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పిచారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచేగాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. అమ్మవారిని సుమారు 30వేల మంది భక్తులు దర్శించుకున్నారు. దర్శన టికెట్లు, వసతి గదులు, వివిధ సేవా టికెట్ల ద్వారా రూ.11.60లక్షల ఆదాయం చేకూరింది. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఛైర్మన్ నాగరాజ రెడ్డి, ఈవో చంద్రమౌళిలు పర్యవేక్షించారు.

ట్రాఫిక్ ఆంక్షలు పాటించకపోతే చర్యలు

చిత్తూరు, జూన్ 2: ఈనెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కారణంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించామని, వాటిని ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్పీ మణికంఠ చందోలు కోరారు. ఆ రోజున ఉదయం 4 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు. చిత్తూరు నుంచి తిరుపతి, కడప, పీలేరు లేదా హైదరాబాదుకు వెళ్లాల్సిన వారు ఇరువారం వైపుగా, వరిగపల్లె జంక్షన్ మీదుగా సిక్స్‌లేన్ హైవేపై వెళ్లాలని తెలిపారు. చెన్నై, వేలూరు నుంచి చిత్తూరు మీదుగా తిరుపతి, కడప, పీలేరు, హైదరాబాదు వెళ్లాలనుకునేవారు రెడ్డిగుంట జంక్షన్ నుంచి వరిగిపల్లె(కాఫీడే)జంక్షన్ వద్దకు వెళ్లి అక్కడి నుంచి సిక్స్‌లేన్ హైవేలో వెళ్లాలని సూచించారు. తిరుత్తణి నుంచి చిత్తూరు మీదుగా తిరుపతికి వెళ్లాల్సిన వారు తానా జంక్షన్ నుంచి జీడీ నెల్లూరు పోలీసు స్టేషన్ మీదుగా పుత్తూరు రోడ్డును వినియోగించుకోవాలన్నారు. కడప-పీలేరు-తిరుపతి నుంచి చిత్తూరుకు రావాలనుకున్న వారు రంగంపేట సిక్స్‌లేన్ హైవేపై వరిగపల్లె జంక్షన్ మీదుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. వావిల్‌తోట-బందపల్లె-పూతలపట్టు మండలం, సమీప గ్రామాల ప్రజ లు చిత్తూరుకు వరిగపల్లె మీదుగా రావాలని కోరారు. తిరుపతి నుంచి చిత్తూరుకు వచ్చేవారికి పెనుమూరు రోడ్డు పూర్తిగా నిషేధించినట్లు చెప్పారు. రంగంపేట ఫ్లైఓవర్ క్రాస్ నుంచి మురకంబట్టు వరకు వాహనాల రాకపోకలు పూర్తి గా నిషేధించినట్లు వెల్లడించారు. కౌంటింగ్ సిబ్బంది, అధికారులు, అభ్యర్థులను మాత్రమే ఎస్వీసెట్ వరకు అనుమతిస్తారని తెలిపారు. రెండవ గేట్ ద్వారా ఆర్వీఎస్ ఆస్పత్రి వెనుక వైపు ఖాళీ ప్రదేశంలో పార్కింగ్‌కు స్థలం కేటాయించామని చెప్పారు. ఏజెంట్లు, పోలీసులు, మీడియా వాహనాల కోసం మహర్షి పాఠశాల ఆవరణలో, పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. పూతలపట్టు నుంచి వచ్చే వాహనాలు ఎడమ వైపు సర్వీసు రోడ్డులో అండర్‌పాస్ ద్వారా పార్కింగ్ ప్రదేశానికి చేరుకోవచ్చని వివరించారు. మురకంబట్టు నుంచి వచ్చే వాహనాలు కుడి మలుపు తిరిగి, ఆపై ఆర్వీఎస్ నర్సింగ్ కళాశాల హాస్టల్ వద్ద కుడి వైపు రహదారి నుంచి మహర్షి పాఠశాల పార్కింగ్ వద్దకు వెళ్లవచ్చునని తెలిపారు.